మహిళ నుంచి రూ.40వేలు అపహరణ

తొర్రూరులోని ఎస్‌బీఐ బ్యాంకులో ఘటన

డబ్బులు దొంగిలించిన కవర్‌ను చూపుతున్న పైండ్ల లత

తొర్రూరు, ఫిబ్రవరి 10 : డ్వాక్రా గ్రూపునకు సంబంధించిన డబ్బులు బ్యాంకులో జమ చేయడానికి వచ్చిన మహిళ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.40 వేలు చోరీ చేసిన ఘటన తొర్రూరు పట్టణంలో సోమవారం జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. తొర్రూరు పట్టణానికి చెందిన ప్రియదర్శిని డ్వాక్రా గ్రూపులో 11మంది సభ్యులున్నారు. ఇటీవల ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రూ.22లక్షల లోన్ రాగా, ఒక్కొక్కరు రూ.2లక్షల చొప్పున తీసుకున్నారు. కాగా, లోన్ తిరిగి చెల్లించేందుకు ప్రతి నెలా రూ.77వేలు బ్యాంకులో జమ చేయాలి. ఈ క్రమంలో సోమవారం మ ధ్యాహ్నం 1.15 గంటలకు డ్వాక్రా సభ్యులు పైండ్ల లత, గ్రూప్ లీడర్ సోమేశ్వరి బ్యాంకులోకి వెళ్లారు. లత వోచర్ రాయడానికి కుర్చీలో పిల్లర్ పక్కన కూర్చున్న సమయంలో ఆమె వద్ద ఉన్న డబ్బుల కవర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి, రూ.40వేలు అపహరించారు. పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. బ్యాంక్ సీసీ కెమెరా పుటేజ్‌ను పరిశీలించి నిందితులను గుర్తిస్తామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

కురవి: రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే ప్రిన్సిపాల్ కో ఆర్డినేటర్ మాలతి

బలపాల రైతువేదికలో రైతులకు శిక్షణ

కురవి, ఫిబ్రవరి 10 : మండలంలోని బలపాల, రాజోలు, లింగ్యాతండా రైతులకు సోమవారం బలపాల రైతువేదికలో పత్తి పంట సాగులో అధిక సాంద్రత, మెరుగైన పద్ధతులపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీపీవో ఎం విజయ నిర్మల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ వీరన్న, కేవీకే మల్యాల ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ మాలతి, శాస్త్రవేత్త కిశోర్ మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేస్తే రైతుకు ఎక్కువ లాభాలు వస్తాయన్నారు. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచి ఒకేసారి చేతికొచ్చేలా పంటకాలాన్ని తగ్గించుకోవచ్చన్నారు. యాజమాన్య పద్ధతులను సక్రమంగా పాటించి గులాబీ రంగు పురుగు బారి నుంచి తప్పించుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల మాట్లాడుతూ.. రైతులు కోతుల విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం కూడా ఈ విషయంపై దృష్టి సారించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నరసింహారావు, విస్తరణ అధికారి లయ, రైతులు అంబటి వెంకటనారాయణ, జవ్వ శ్రీనివాస్, లింగ్యానాయక్, బానోత్ రమేశ్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర కార్యదర్శిగా రాజు

నియామక పత్రం అందుకుంటున్న రాజు

బయ్యారం, ఫిబ్రవరి 10 : ప్రపంచ వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర కార్యదర్శిగా బయ్యారం మండలం లక్ష్మీనరసింహాపురం గ్రామానికి చెందిన పోలేబోయిన రాజు నియామకమయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సంస్థ, ఫౌండర్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ నియామక పత్రం అందజేశారు.

పర్వతగిరిలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

స్థానిక ఎన్నికల నేపథ్యంలో కంఠాయపాలెం గ్రామంలో జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్‌లోకి వలసల వెల్లువ

- ఎర్రబెల్లి సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మడిపల్లి వాసులు

తొర్రూరు, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి వలసల వెల్లువ కొనసాగుతున్నది. తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు అనూహ్యంగా బీఆర్ఎస్ పార్టీలో చేరడం చర్చనీయంగా మారింది. మడిపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు ఎండీ పాషా, ఉద్యమ నాయకుడు వేల్పుల వెంకన్న, ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి నర్రా జంపయ్యతో సహా 20మంది తమ అనుచరులతో కలిసి సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్వగ్రామం వరంగల్ జిల్లా పర్వతగిరికి వెళ్లి బీఆర్ఎస్‌లో చేరారు. దయాకర్‌రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన పలువురు నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని 14 నెలలు ఎదురుచూశామని, ఏ ఒక్క పథకం సరిగ్గా అమలు కాలేదన్నారు. ప్రజలకు మంచి చేయగలిగే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ..మీ నిర్ణయం మీ గ్రామానికి, మండలానికి మేలే చేస్తుందన్నారు. ఇది కేవలం పార్టీలో చేరిక మాత్రమే కాదని, నిజమైన అభివృద్ధికి దారి తీసే మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. కాగా, కంఠాయపాలెం గ్రామంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ నేత మంగళపల్లి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని, వచ్చే స్థానిక ఎన్నికల్లో వారికి గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు బిందూశ్రీనివాస్, ఈనెపల్లి శ్రీను, మహంకాళి భూపతి, గోసం టగి భాస్కర్, పల్లె సర్వయ్య, ఆవుల ఉపేందర్, లక్కిడి శ్రీధర్, జగదీశ్వర్, ముత్తయ్య, కృష్ణ, ఏకాంబరం, నాగరాజు, పల్లె నరేందర్, ప్రదీప్, సుధాకర్ పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లోనే చెక్‌పోస్టులు

మిగతా గ్రామాల్లో ఏవి?

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

నర్సింహులపేట, ఫిబ్రవరి 10 : మండలంలోని వివిధ గ్రామాల శివార్లలో ఆకేరువాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా, కేవలం మూడు గ్రామాల్లో మాత్రమే చెక్‌పోస్టులు ఏర్పా టు చేసి మిగతా గ్రామాల్లో ఏర్పాటు చేయక పోవడంతో అధికారుల తీరుపై మండల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కౌసల్యాదేవిపల్లి, రామన్నగూడెం, ఫకీరతండా, జయపురం, కొమ్ములవం చ, బొజ్జన్నపేట గ్రామాల శివారు నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతున్నది. అధికారులు మాత్రం రామన్నగూడెం, కౌసల్యదేవిపల్లి, నర్సింహులపేట గ్రామాల మ ధ్య ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఫకీరతండా, జయపురం, కొమ్ములవంచ గ్రామాల పరిధిలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో రాత్రి వేళల్లో ఇసుక అక్రమ దం దా జోరుగా సాగుతున్నది. కొందరు పగలు కార్యాలయాల్లో అధికారులతో ఉంటూ, రాత్రి వాగుల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జేవీ చలపతిరావు

కొత్తగూడ, ఫిబ్రవరి 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి జేవీ చలపతిరావు అన్నారు. ఈ మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పాకాల కొత్తగూడ మండల కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సన్నధాన్యానికి బోనస్ ఇస్తామని ప్రకటించిన సర్కారు, ధాన్యం అమ్ముకొని రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు బోనస్ డబ్బులు ఇవ్వలేదన్నారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగ భృతి, ఉద్యోగ భద్రత, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా వంటి పథకాలు ప్రకటించి, అధికారంలో వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. ఇచ్చిన హామీలన్నీ తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, రాష్ట్ర నాయకులు బండారి ఐలయ్య, మురళీకృష్ణ, జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్, శ్రీధర్, పద్మక్క, నర్సక్క, మధు, భరత్, రాకేశ్, రాజమల్లు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య దహనాలు నిలిపేయాలి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : పట్టణంలోని ఈద్గా బజార్, భవానీనగర్ తండా సమీపంలో జనావాసాలు ఉండే ప్రాంతాల్లో దహన సంస్కారాలు నిలిపివేయాలని కాలనీవాసులు అహ్మద్‌ఖాన్, నజీర్, ఫిరోజ్ కోరారు. ఈ మేరకు సోమవారం పలువురు కాలనీవాసులు మున్సిపల్ చైర్మన్ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో చనిపోయిన వారిని అక్కడికి తీసుకొచ్చి దహనం చేయటంతో దుర్వాసనతోపాటు చిన్న పిల్లలు భయాందోళన గురవుతున్నారని అన్నారు. దహన కార్యక్రమాలు శ్మశాన వాటికలో చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వేరే పేర్లు చేర్చడం సరికాదు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : కాట్రపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో అక్రమంగా వేరే గ్రామ ముదిరాజ్ కులస్తుల పేర్లను చేర్చడం సరైందికాదని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్నకు సంఘంలో ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాట్రపల్లి ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం 48మంది సభ్యులతో నడుస్తున్నదని, ఇప్పటివరకు వారి ఆధీనంలో సంఘం పని చేస్తున్నదన్నారు. ఇటీవల మత్స్యశాఖ అధికారులు లోపాయికారి ఒప్పందంతో పక్క గ్రామానికి చెందిన కొంతమందిని ఈ సంఘంలో కార్యవర్గం ఆమోదం లేకుండా సభ్యత్వం ఇచ్చారని, వెంటనే ఉన్నతాధికారులు పరిశీలించి, వేరే గ్రామస్తులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలయ్య, భద్రయ్య, యాకయ్య, బాలకృష్ణ, మల్లేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల వి ద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన పట్టణ శివారులోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ బ హుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఫిజికల్ టాలెంట్ టెస్ట్ అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, ఆజాద్, ఫిజికల్ ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, గాయత్రి పాల్గొన్నారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించొద్దు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : ఎరువుల దుకాణాల యజమానులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని మానుకోట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అమనగల్ గ్రామంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. రైతులకు వారి ఆధార్‌కార్డ్‌తోనే ఎరువులను విక్రయించి, రసీదులు అందజేయాలన్నారు. నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం

సోషల్ మీడియాలో పెట్టొద్దు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : మహిళలు, విద్యార్థులు తమ వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దని షీ టీం ఎస్సై సునంధ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, బాలికలు ఎక్కువగా తమకు తెలిసిన వారితోనే వేధింపులకు గురవుతున్నారని అన్నారు. వేధింపులకు పాల్పడిన వారి వివరాలను తెలియజేస్తే వారి ఆట కట్టిస్తామన్నారు. అనవసరమైన లింకులను క్లిక్ చేసి సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు సాంబశివరావు, సుమన్, యుగేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరికి గాయాలు

మహబూబాబద్ రూరల్, ఫిబ్రవరి 10 : విద్యుత్ షాక్‌తో ఒకరికి గాయాలైన ఘటన పట్టణంలో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని మిల్లీ కాలనీకి చెందిన బూర్గుల ముత్తయ్య సుతారి పని కోసం రాజీవ్‌నగర్ కాలనీ ఓ ఇంటిపై పని చేస్తుండగా 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు.

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 10: బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ ధరావత్ వెంకన్న నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని శనిగపురం గ్రామంలో సేవాలాల్ జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని 18 మండలాల గిరిజనులు ఐక్యంగా ఈ నెల 15న సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా జరుపుకోవాలన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వం అన్ని పండుగలకు సెలవు ఇచ్చినట్లుగా సేవాలాల్ జయంతికి సైతం సెలవును ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందూలాల్‌నాయక్, సురేశ్‌నాయక్, రాంబాబు, ప్రవంతి, నరేందర్, సుమన్ పాల్గొన్నారు.

ఫోన్ కాల్‌తో మోసం

మరిపెడ, ఫిబ్రవరి 10: సైబర్ క్రైమ్ మోసాలకు అంతు లేకుండా పోతుంది. తాజాగా, మండలంలో ఒకరు సైబర్ మోసగాళ్ల బారిన పడి మోసపోయిన ఘటన మండలంలోని ఎల్లంపేట గ్రామంలో ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన జంగ శరణ్యకు జనవరి నెలలో నౌకరీ డాట్ కాం నుంచి ఫోన్ కాల్ వచ్చింది. డెల్ కంపెనీలో సీనియర్ ఎనాలసిస్ట్ జాబ్‌కు మీరు ఎంపికయ్యారు. ప్రక్రియను ప్రారంభించడానికి రుసుము చెల్లించాలని తెలపడంతో బాధితురాలు తన బ్యాంక్ అకౌంట్ నుంచి విశ్వాస్ మున్న అకౌంట్‌కు రూ.25,331వేలు పంపింది. అనంతరం నౌకరీ డాట్ కాంకు ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్విచ్‌ఆఫ్ రావడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

గార్ల, ఫిబ్రవరి 10: పందులు విషయంలో గొడవ పడిన ఇరువర్గాలపై గార్ల పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని ఎరుకల బజారులో ఉప్పలమ్మ, లచ్చమ్మ పందుల విషయంలో గొడవ పడ్డారు. కర్రలతో దాడి చేసుకున్నారు. లచ్చమ్మ, ఉప్పలమ్మ తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరూ పరస్పరం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పూరిగుడిసె దగ్ధం

గూడూరు, ఫిబ్రవరి10: విద్యుదాఘాతంతో పూరి గుడిసె దగ్ధమైన ఘటన మండలంలోని బొల్లెపల్లి గ్రామ పరిధి ధర్మతండాలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని బానోత్ రామక్క ఇంటిని నిర్మించుకుంటుండగా, తను ఉండేందుకు తనకున్న స్థలంలో చిన్న పూరిగుడిసెను ఏర్పాటు చేసుకున్నది. గుడిసెలో తన ఇంటి సామగ్రి, రూ.లక్ష విలువచేసే ఫర్నిచర్, రూ.లక్ష నగదు పెట్టి వ్యవసాయ పనులకు వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో ఇల్లుకు నిప్పంటుకొని, గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు, ఇంట్లో ఉన్న సామగ్రి, నగదు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.3లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

డోర్నకల్, ఫిబ్రవరి 10: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన గొల్లచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. సీఐ రాజేశ్ కథనం ప్రకారం.. గూడూరు మండలం నాయకపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రాజేశ్ (28) డోర్నకల్‌లో సైట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి సుమారు 11.40 గంటల సమయంలో బైక్‌పై వెళ్తుండగా గొల్లచర్ల సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో చెట్టును ఢీకొట్టాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న అశోక్ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్ పోయినది
నేను, కేమిడి జయమ్మ W/o యాకయ్య, R/o గ్రా॥ లక్ష్మీనారాయణపురం, మం॥ పాలకుర్తి, జి॥ జనగామ. మా యొక్క విస్నూరు గ్రామ వ్యవసాయ భూమి ఎ. 2-37 గుంటలు, సర్వే నెం. 605, 610, 612, ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 1243/2014 గలది జనవరి 17న జనగామకు బ్యాంక్‌లోన్ పని నిమిత్తం పోయి వస్తుండగా పోయినది. దొరికినవారు దయచేసి సంప్ర: సెల్: 9347485283, 9182809036

BUILDING FOR SALE

★H.No: 2-6-75, Circuit House, Nakalgutta Hanamkonda, Ground floor Bldg, 160.7 Sq.yds, 1000 sqft RCC buildup area, East Facing, 1.15 Cr. Clear tittle, Brokers pls excuse. **Contact: 9949912347, 999896 12347, 63025 53816.**
NTW-332462

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి సురేశ్

కురవి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి

కురవి, ఫిబ్రవరి 10 : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సివిల్ సీనియర్ జడ్జి సురేశ్ అన్నారు. మండలంలోని మోద్గుల గూడెం జడ్పీ హై స్కూల్‌లో సోమవారం జి ల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీరోలు ఎస్సై నగేశ్, హెచ్‌ఎం సత్యనారాయణచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

కేసముద్రం, ఫిబ్రవరి 9 : గంజాయి తరలిస్తున్న ముగ్గురిని మండల కేంద్రంలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై మురళీధర్‌రాజు సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని ఇంటికన్నె గ్రామానికి చెందిన బానోత్ హరినాథ్, బయ్యారం మండలానికి చెందిన గుగులోత్ చరణ్, మరిపెడ మండలానికి చెందిన లూనావత్ ప్రవీణ్ ఒడిశా రాష్ట్రానికి చెందిన నబీన్‌ప్రధాన్ అనే వ్యక్తి వద్ద సుమారు రూ.లక్ష విలువైన 4 కిలోల ఎండు గంజాయిని రైలులో తీసుకొచ్చారు. కేసముద్రం మండల కేంద్రంలోని ఉప్పరపల్లి రోడ్డు వద్ద వాహనాల కోసం ఎండు గంజాయితో ఎదురు చూస్తున్నారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని పరిశీలించారు. గంజాయి లభించడంతో హరినాథ్, చరణ్, ప్రవీణ్‌ను అరెస్టు చేశారు. మరొకరు నబీన్ ప్రధాన్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దంతాలపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని బీరిశెట్టిగూడెం, వాల్యతండా, దాట్ల, రేపోణి గ్రామ పంచాయతీ పరిధిలో పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీడీవో పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీవో అప్సర్‌పాషా, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం

చిన్నగూడూరు : ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందుతున్నదని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉగ్గంపల్లి మంచ్యాతండాకు చెందిన ప్రియాంక సోమవారం పురిటి నొప్పులతో వైద్యశాలకు రాగా, వై ద్యులు సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు మాధవి, ఏఎన్‌ఎం భారతి, సిబ్బంది వలిఉద్దీన్, రాధాకుమారి పాల్గొన్నారు.

ఎంపీడీవోగా యాకయ్యకు పదోన్నతి


యాకయ్య

నర్సింహులపేట, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న కిన్నెర యాకయ్యను ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింహులపేట గ్రామానికి పంచాయతీ కార్యదర్శిగా 12ఏళ్లు పని చేసిన ఆయన పెద్దవంగర, చిన్నగూడూరులో ఎంపీవోగా పని చేసి బదిలీపై మండలానికి వచ్చారు. ఎంపీడీవోగా పదోన్నతి పొంది పూర్తి బాధ్యతలు రావడంతో పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నాయకులు సన్మానించారు.

25 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం

పట్టుబడిన నల్లబెల్లాన్ని చూపుతున్న ఎస్సై చిర్ర రమేశ్ బాబు

నెల్లికుదురు, ఫిబ్రవరి 10 : అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం నెల్లికుదురులో జరిగింది. ఎస్సై రమేశ్‌బాబు కథనం ప్రకారం.. వావిలాల గ్రామ బస్‌స్టేజీ వద్ద సోమవారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు బానోత్ రాంలాల్, గోగుల ప్రశాంత్, కావటి శ్రీనివాస్, మార్త యుగేందర్ ఓ వాహనంలో 50 బ్యాగుల్లో 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి, పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడు అదృశ్యం

కోల నవీన్

దంతాలపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైనట్లు సమాచారం. గ్రామానికి చెందిన కోల శ్రీను–యాకమ్మ దంపతుల కుమారుడు కోల నవీన్ ఈ నెల 9న హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్నట్లు చెప్పి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి నవీన్ ఆచూకీ తెలియకపోగా, సెల్‌ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తున్నది. దీంతో ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు, నవీన్ ఆచూకీ తెలపాలంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్యాయత్నం

తొర్రూరు, ఫిబ్రవరి10 : పురుగు మందు తాగి ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తొర్రూరు మండలంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. సోమారపుకుంట గ్రామపంచాయతీ తులసితండాకు చెందిన బానోత్ శ్రీను, లలిత దంపతుల మధ్య సోమవారం ఉదయం కుటుంబ కలహాలు తీవ్రస్థాయికి చేరాయి. దీంతో శ్రీను మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో పురుగు మందు తాగి ఫతేపురం సమీపంలో ఉన్న కల్యాణలక్ష్మి గార్డెన్ వద్ద రోడ్డు పక్కన పడిపోయాడు. స్థానికులు అతడిని స్థానిక వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని, వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

ఘనంగా వెంకన్న పుట్టిన రోజు వేడుకలు


వెంకన్నను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 10 : ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు శిష్యుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు జెర్రిపోతుల వెంకన్న పుట్టిన రోజు వేడుకలు ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ రవీందర్‌రావు వెంకన్నతో కేక్‌కట్ చేయించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, హరినాయక్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థినుల వసతి గృహం వద్ద ఆకతాయిల హల్‌చల్

- భయాందోళనకు గురైన విద్యార్థినులు
- డయల్ 100కు కాల్

చిన్నగూడూరు, ఫిబ్రవరి 10 : మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన ఆటల పోటీల సందర్భంగా విద్యార్థినులు బస చేసిన ఇంటి వద్ద కొందరు ఆగతాయిలు వికృత చేష్టలకు పాల్పడినట్లు ఆలస్యంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే ఉగ్గంపల్లిలో శని, ఆదివారాల్లో హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు గోర్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులకు శనివారం గ్రామంలోని ఓ ప్రైవేటు ఇంట్లో వసతి ఏర్పాటు చేశారు. కాగా, శనివారం రాత్రి బస చేసిన ఇంటి వద్ద కొందరు ఆకతాయిలు విద్యార్థినులతో వికృత చేష్టలకు పాల్పడగా, డయల్ 100ఫోన్ చేశారు. దీంతో పోలీసులు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడి వారిని మరో ఇంటికి మార్చారు. బాలికలకు రక్షణ కల్పించాల్సిన అధికారులే వారిని వదిలివేశారనే ప్రచారం జరుగుతున్నది. వ్యాయామ ఉపాధ్యాయులు వారికి రక్షణగా ఉండాల్సింది పోయి అందుబాటులో లేకపోవడంతో విద్యార్థినుల పరిస్థితి అగమ్యగోచరంగా మారినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. వక్రబుద్ధి కలిగిన కొందరు ఉద్యోగుల పేర్లు బయటికి రాకుండా చూసేందుకు అధికారులు ప్రయత్నించినా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయమై పోలీస్, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఎస్సై జాన్సీని వివరణ కోరగగా .. 100కు విద్యార్థినులు ఫోన్ చేసిన మాట వాస్తవమేనన్నారు. బస చేసిన ఇంటి వద్ద రాత్రి తలుపుల చప్పుడు కావడంతో బయపడి 100కు డయల్ చేశారని అన్నారు. వెంటనే వారిని వేరే ఇంటికి మార్చినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.